క్లుప్తంగా

పన్నులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె రూరల్: పట్టణ ప్రజలు, వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. వ్యాపార సంస్థల యజమానులు తమ లైసెన్స్‌లను రెన్యువల్ చేయించుకుంటూ ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులు చెల్లించాలన్నారు. ఈ నెల 28వ తేదీ లోపు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని తెలిపారు. నెలాఖరుతో సంబంధిత వెబ్‌సైట్ నిలిచిపోతుందని, అనంతరం వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక 25 నుంచి 40 శాతం అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టణంలో ఈ ఆర్థిక సంవత్సంలో రూ.50 లక్షల ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు కావాల్సి ఉండగా 50 శాతం మాత్రమే వసూలయ్యాయన్నారు. వ్యాపారస్తులు సకాలంలో చెల్లించాలని కోరారు. మార్చి నెలాఖరు నాటికి ఇంటి, నీటి పన్నులను చెల్లించాలని కమిషనర్ సాంబశివరావు తెలిపారు. 2024-25 రెండవ అర్ధ సంవత్సరం ఫీజులు సకాలంలో చెల్లించని యెడల 10 శాతం అపరాధ రుసుముతో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా వ్యర్థాల పొగ



కొల్లూరు : పంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యం ప్రయాణికుల ప్రాణాలకు ముప్పులా పరిణమిస్తుంది. కొల్లూరు పంచాయతీలో నిత్యం వెలువడే వ్యర్థాలను పంచయాతీ అధికారులు సిబ్బందితో కరకట్ట వెంబడి పోయించి దగ్ధం చేయించడం పరిపాటిగా మారింది. పంచాయతీ వ్యర్థాలు దగ్ధం అవుతుండటంతో వెలువడుతున్న దట్టమైన పొగ కరకట్ట మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ప్రాణ సంకటంగా తయారైంది. ఈ మార్గంలో అధిక సంఖ్యలో ప్రయాణించే వాహనదారులు పొగ కారణంగా రహదారి కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనం సైతం కనిపించని రీతిలో పొగ వెలువడుతుండటంతో వాహనాలు ఢీకొని ప్రాణాలు పోగొట్టుకునే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ వ్యర్థాలను కరకట్ట మార్గంలో వేసి దగ్ధం చేయడం పంచాయతీ అధికారులు మానుకోవాలని కోరుతున్నారు.

రోటరీ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం



బాపట్ల: సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని వైద్య సేవలు పొందాలని యజ్ఞ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ బెల్లంకొండ పేర్కొన్నారు. యజ్ఞ హాస్పిటల్ నెలకొల్పి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రోటరీ క్లబ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో జనరల్, గుండె వ్యాధుల ప్రత్యేక నిపుణులు డాక్టర్ శ్రీకాంత్, స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ మాధవి, ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ టి.పవన్‌కుమార్ రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యజ్ఞ వెంకటేశ్వరరావు, కేసన రాజా, చేజర్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు సన్మానం

తెనాలిటౌన్: కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సాధించిన పలువురు సభ్యులను సంగంజాగర్లమూడి స్విమర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామంలో ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో సంగంజాగర్లమూడి స్విమర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫిబ్రవరి 2వతేదీన నిర్వహించిన కృష్ణా రివర్ క్రాసింగ్ పోటీల్లో సంగంజాగర్లమూడికి చెందిన స్విమర్స్ అసోసియేషన్ సభ్యులు 20 మంది పాల్గొన్నట్లు తెలిపారు. 31 నుండి 40 సంవత్సరాలు గ్రూప్‌లో 3వ బహుమతి సాధించిన టి.నాగ బ్రహ్మారెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పొదిలి వాసు, నారాయణ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలియజేశారు. అదే విధంగా స్విమర్ అసోసియేషన్ సభ్యుడు అయిన జి.అర్జునరావు సబ్‌రిజిష్టర్‌గా పదవి విరమణ పొందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, కేబుల్ శ్రీను, బాల, రాఘవరెడ్డి, జనార్దన్, రాఘవ, నీరంజన్, పాలడుగు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నిషేధానికి నీళ్లు.. యథేచ్ఛగా అమ్మకాలు

- ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయని అధికారులు
- లేవంటూనే.. అధిక రేట్లకు అమ్ముతున్న దుకాణదారులు



ఖైనీ, గుట్కా ప్యాకెట్లు

బాపట్లటౌన్: ప్రభుత్వ ఆదేశాలు బుట్టదాఖలవుతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న ఖైనీ, గుట్కాను ప్రభుత్వం నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసినా వాటిని అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. బాపట్ల నియోజకవర్గ పరిధిలో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతుంది. ఇటీవల భారీగా గుట్కా ప్యాకెట్లు బాపట్లలో పట్టుకున్నప్పటికీ మళ్లీ కొంతమంది ఆ వ్యాపారాన్ని యథేచ్ఛగా చేస్తున్నారు. బాపట్లలోని కూరగాయల మార్కెట్, చీలురోడ్డు, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్ కేంద్రాలలో ఈ వ్యాపారాలు జోరందుకుంటున్నాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రత్యేక వాహనంలో రాత్రి సమయంలో పట్టణంలోని కొందరి గృహాలకు ఈ ప్యాకెట్లు వస్తున్నాయి. వాటిని బాపట్ల, కర్లపాలెం మండలాల్లోని గ్రామాలకు బాపట్లలోని వ్యక్తులు సరఫరా చేస్తున్నారు. పట్టణం మొదలు పల్లెటూరు వరకు యథేచ్ఛగా గుట్కా ప్యాకెట్ల విక్రయాలు జరుగుతున్నాయి. గుంటూరుతోపాటు చెన్నై నుంచి ప్యాకెట్లు ఇక్కడ కొంత మంది వ్యాపారులకు అందటంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా మారింది.

పట్టని అధికారులు

క్యాన్సర్ కారకంగా ఉన్న గుట్కాను నిషేధించాలని ఎప్పటి నుంచో ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేసి ఉద్యమాలు లేవనెత్తాయి. దీంతో ప్రభుత్వం సెక్షన్ 30(2)(ఏ) ఆహార భద్రత చట్టం 2006 కింద వీటిపై నిషేధం విధించింది. వీటి అమ్మకాలు తక్షణమే నిలిపివేయాలని ప్రత్యేక జీఓలో పేర్కొంది. అయినా వ్యాపారస్తులు ఈ నిషేధాజ్ఞలను పెడచెవిన పెట్టి ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. నిషేధం విధించినందుకు సరుకు దొరకడం లేదని చెప్పి అధిక ధరలకు అమ్ముతున్నారు. గుట్కాలకు బానిసలుగా మారిన వారు అధిక ధరలు పెట్టి కొంటూనే ఉన్నారు. అయినా అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు.

రోజుకు వేలల్లో వ్యాపారం

జిల్లా వ్యాప్తంగా హీరా, మానిక్‌చంద్, ఛాంపియన్స్, పాన్‌పరాగ్, రాజాచైనీ, ఖైనీ లాంటి కంపెనీలకు చెందిన గుట్కాలు జోరుగా విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌ను సరాసరి రూ.20 నుంచి రూ.40 వరకు అమ్ముతున్నారు. దీంతో గుట్కా వ్యాపారులు రోజుకు వేలల్లో సంపాదిస్తున్నారు.

గుట్కాలతో నోటి క్యాన్సర్

గుట్కాలు తింటే నోటి సమస్యలు మొదలు కొని జీర్ణ వ్యవస్థ వరకు అన్నింటిపై ప్రభావం పడుతుంది. పళ్లు అరిగిపోయి గారలు పడతాయి. నాలుక రుచిమొగ్గలు నశిస్తాయి. చివరకు నోరు, నాలుక గొంతుకు క్యాన్సర్ వ్యాధి రావచ్చు. వీటి వల్ల ప్రాణనష్టం కూడా జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్కాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.

– డాక్టరు సిద్దార్థ్, సూపరింటెండెంట్ ఏరియా వైద్యశాల, బాపట్ల

కఠినంగా శిక్షిస్తాం

పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా గుట్కా, ఖైనీలు విక్రయాలు జరిపే దుకాణాలపై దాడులు నిర్వహించి విక్రయాలు జరిపే వారిని కఠినంగా శిక్షిస్తాం. అలాగే రవాణా చేసే వారిని కూడా గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– రాంబాబు, సీఐ, బాపట్ల

నేటి నుంచి మల్లికార్జునేశ్వరస్వామి తిరునాళ్ల

11న స్వామి వారి కల్యాణ మహోత్సవం



అడవులదీవిలోని భ్రామరీ బాలా త్రిపుర సుందరీ సహిత మల్లికార్జునేశ్వరస్వామి ఆలయం

నిజాంపట్నం: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందినది భ్రామరీ బాలా త్రిపుర సుందరీ సహిత మల్లికార్జునేశ్వరస్వామి ఆలయం. నిజాంపట్నం మండలంలోని అడవులదీవిలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రతి ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. గ్రామస్తులు యల్లాప్రగడ వెంకట చలమయ్య, ధర్మపత్ని మంగమ్మలు 1928వ సంవత్సరంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. సుమారు 97 సంవత్సరాల చరిత్ర ఈ ఆలయానికి ఉంది. బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరునాళ్లను ప్రతి ఏడాది కనుల పండువగా నిర్వహిస్తుంటారు. ఈ నెల 11న స్వామి వారి కల్యాణం వైభవంగా జరగనుంది. ఇప్పటికే తిరునాళ్లకు ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.

- తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా 10వ తేదీన పశువులచే ఆలయ ప్రదక్షిణ, 11వ తేదీ రాత్రి స్వామి వారి కల్యాణం, విద్యుత్ ప్రభల ఏర్పాటు, 12వ తేదీ ఉదయం సముద్ర స్నానాలు నిర్వహించబడతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.
- మల్లికార్జునేశ్వరస్వామి తిరునాళ్ల తీర ప్రాతంలో తొలి తిరునాళ్ల కావడంతో ప్రతి ఏడాది అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. భక్తులు తిరునాళ్లను తిలకించి మరుసటి రోజు సమీపంలోని దిండి బీచ్ వద్ద సముద్ర తీరంలో పుణ్యస్నానాలను ఆచరించడం ఆనవాయితీ. తిరునాళ్లలో భాగంగా ఇప్పటికే పలు దుకాణాలను ఏర్పాటు చేసే పనిలో దుకాణదారులు నిమగ్నమయ్యారు.

నేటి నుంచి తాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం





తిరునాళ్ల మహోత్సవానికి ముస్తాబువుతున్న తాళ్లమ్మ దేవస్థానం, తాళ్లమ్మ అమ్మవారు

నగరం: మండలంలోని ధూళిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న తాళ్లమ్మ, వీరమ్మ, పేరంటాళ్లమ్మ దేవస్థాన తిరునాళ్ల మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తియ్యాయి. సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఆలయ కమిటీ సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. ధూళిపూడి పరిధిలోని 18 గ్రామాలకు ఇలవేల్పు అయిన తాళ్లమ్మ అమ్మవారి తిరునాళ్లను ప్రతి ఏడాది మాఘ మాసంలో పౌర్ణమి రోజున అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ

అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఏడాది 10, 11 తేదీలలో జరిపేందుకు ఆలయ కమిటీ నిశ్చయించింది. 10వ తేదీన అమ్మవారికి నైవేద్యాలు, 11న శిడిమానోత్సవం జరిపేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. తిరునాళ్లను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి ఆలయాన్ని విద్యుత్ దీపాల అలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు.

ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరం



పడవల వంతెనపై వాహనం ఢీ కొనడంతో కూలిన రక్షణ గ్రిల్

కొల్లూరు : పడవల వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారడంతో విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కొల్లూరు లాక్‌సెంటర్ పడవల వంతెనపై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా తయారైంది. నిబంధనలకు విరుద్ధంగా వంతెనపై ప్రయాణిస్తున్న వాహనాల కారణంగా వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెనపై నున్న రక్షణ గోడను ఓ ట్రాక్టర్ ఢీ కొనడంతో గ్రిల్‌తో సహా కాలువ వైపుకు కూలిపోయింది. లంక గ్రామాల ప్రజలతోపాటు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ వంతెన ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంది. వంతెన రక్షణ గ్రిల్ లేకపోవడంతో ఎదురుగా వాహనాలు వచ్చే సమయంలో ఏ మాత్రం అదుపు తప్పినా ప్రమాదాలకు గురయ్యే ముప్పు పొంచి ఉంది. నీటిపారుదల శాఖాధికారులు తక్షణం స్పందించి వంతెన మరమ్మతులు జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

సేవా భగవాన్ పురస్కారాలు ప్రదానం

తెనాలిఅర్బన్: తెనాలికి చెందిన సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఈఎల్‌వీ అప్పారావుకు సేవా భగవాన్ పురస్కారాలను చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కమిటీ సభ్యులు అందజేశారు. జయ జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలకలూరుపేటలోని మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం సేవా భగవాన్ 2025 పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. పురస్కారాలు అందుకున్న వీరిని జయ జయ జయ సాయి ట్రస్ట్ వ్యవస్థాపకులు పూసపాటి బాలాజీ, సభ్యులు అభినందించి సత్కరించారు.

టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించండి


తెనాలిఅర్బన్: పదోవ తరగతి పరీక్షల్లో అందరూ మంచి మార్కులు సాధించాలని తెనాలి ఎంఈఓ-2 వి.జయంతిబాబు పేర్కొన్నారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం జరుగుతున్న స్టడీ అవర్స్‌ను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని అభ్యాసన సమర్థ్యాలను పరిశీలించేందుకు డైలీ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయుల తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి మైలురాయి అని, ఇక్కడ సాధించిన మార్కులు ఉద్యోగ జీవితానికి ముఖ్యమన్నారు. తెనాలి పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను ఏ,బీ,సీ గ్రేడ్‌లుగా విభజించి వారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. సోమవారం నుంచి ప్రీ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని, వాటికి సంబంధించిన పేపర్లు మండల పాయింట్‌కు చేరుకున్నట్లు వివరించారు. విద్యార్థులు ఉదయం, సాయంత్రం అదనంగా స్నాక్స్‌తో పాటు సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెనాలిలో హనుమాన్ చాలీసా పోటీలు



తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ శ్రీలక్ష్మీశారద సంగీతాలయం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామసమేత గోవర్ధనస్వామి ఆలయంలో విద్యార్థులకు శ్రీహనుమాన్ చాలీసా పోటీలను నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసడు గౌరావఝులఆంజనేయశాస్త్రి నిర్వహణలో బాలురు, బాలికల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. హనుమాన్ చాలీసాలోని శ్లోకాలపై నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి అందజేశారు. జూనియర్స్‌లో వి.పార్థు కృష్ణసాయి, అందె తన్మయి, పి.లక్ష్మీప్రణతి, సీనియర్స్‌లో ఎస్.సుచరిత, పి.రత్నప్రియాకం, జి.గ్రీష్మసాయితేజస్వి విజేతలుగా నిలిచారు. మరో తొమ్మిదిమందికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. .న్యాయనిర్ణేతలుగా ఆరాధ్యుల ఆదినారాయణరావు, ఉప్పులూరి శారదచలపతి వ్యవహరించారు. గౌరావఝుల సౌజన్య, కొండపి శ్రీనివాసరావు, అందె బాల చంద్రమౌళి, రాజేశ్వరి, ఆలయప్రధాన అర్చకుడు రఘు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



వేమూరు: పేద ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలోని శంకర ఉచిత వైద్య శిబిరం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర కంటి ఆసుపత్రి ద్వారా పేదలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించి ఆపరేషన్‌లు చేయడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజలందరు ఉచిత కంటి వైద్య శిబిరం వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ విజయబాబు, బందారు సూరిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతు బజారు

నిర్మాణం పూర్తి చేసి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్న ప్రజలు



రైతు బజారులో పాడైపోయిన ద్విచక్రవాహనాలు, బస్తాలతో నింపిన ఇతర వస్తువులు

రేపల్లె రూరల్: పట్టణంలో నిర్మాణంలో ఉన్న రైతు బజారు ఆక్రమణదారులకు అడ్డాగా మారింది. తీర ప్రాంతంలోని రైతుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.10 కోట్ల వ్యయంతో రైతు బజారు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల కోడ్ వచ్చేనాటికి 90 శాతం పనులు పూర్తవ్వగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు బజారు నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించింది. దీంతో రైతు బజారు నిర్మాణం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎనిమిది నెలలు కావస్తున్నా రైతు బజారు నిర్మాణం పూర్తి చేయటంపై పాలకులు, అధికారులు శ్రద్ధ చూపకపోవటంతో స్థానికంగా ఉండే వ్యాపారులు తమ ముడి, ఇతర సామగ్రిని రైతు బజారులో పడవేస్తున్నారు. రైతులకు, పట్టణ ప్రజలకు ఉపయోగపడాల్సిన రైతు బజారు నిరుపయోగంగా మారుతోంది. చుట్టు పక్కల ఉండే ద్విచక్రవాహనాలను, ఇతర సామగ్రిని రైతు బజారులో ఉంచటంతో ఆ ప్రాంతం అపరిశుభ్రతగా మారుతోంది. అదేవిధంగా భవన నిర్మాణాలు 90 శాతం పూర్తవ్వటం, షట్టర్‌లు లేకపోవటంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రైతు బజారు నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావటంతో పాటు ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

రైతులు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి

ఏవో రమేష్‌బాబు



రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

నగరం: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ (డిజిటలైజేషన్) చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) ఇస్తుందని ఏవో రమేష్‌బాబు చెప్పారు. మండలంలోని శిరిపూడిలో రైతులకు యూనిక్‌ఐడీపై జరిగిన అవగాహన సదస్సులో ఏవో పాల్గొని మాట్లాడారు. సొంత భూమి కలిగిన రైతులకు ఆధార్‌కార్డ్ తరహాలో యూనిక్ ఐడీలను అందిస్తుందన్నారు. పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డ్, ఆధార్ నంబర్ లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతుల భరోసా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. యూనిక్ ఐడీ నెంబర్ వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలు రాయితీలు పంటల బీమా, రుణాలు వంటి సేవలకు ఉపయోగపడుతుందన్నారు. సొంత భూమి కలిగిన రైతులు తప్పనిసరిగా ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు.

వేమూరు: కేంద్ర ప్రభుత్వం సొంత భూమి గల రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను తీసుకొని రావడం జరిగిందని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సొంత భూమి గల రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి నమోదు చేయించుకోవాలని ఆమె తెలిపారు. ప్రభుత్వం ఆధార్ కార్డులాగా రైతులకు 14 అంకెల గల కార్డు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 14 అంకెల గల కార్డు ఉన్న రైతులు కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీలు, పథకాలు పొందవచ్చని ఆమె తెలిపారు. రైతులందరు వెంటనే గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి 14 అంకెల కార్డు పొందాలని అన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవం

తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 14 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు సీతారాముల కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో, మారుతి మిత్ర బృందం కల్యాణ ఘట్టాన్ని కమనీయంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి తిరుచ్చి వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచముఖ ఆంజనేయ స్వామిబ్రహ్మోత్సవాలను వైఖానస ఆగమరీతిన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందానికి చెందిన ఆర్‌వీ కిరణ్ కుమార్, ఆర్.సురేష్, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, సంకీర్తన బృందం ముఖ్యులు మూర్తి అనురాధ. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మదుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గుడివాడ బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



అయితానగర్‌లో ఎన్నికల ప్రచారం

తెనాలి: కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తిరిగి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు ఓటర్లను కోరారు. వివిధ సంఘాల నాయకులు ఆదివారం స్థానిక అయితానగర్‌లో ఎన్నికల ప్రచారం ఆరంభించారు. ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, కౌలు రైతులు, విద్యార్థి, యువజన, అంగన్‌వాడి, ఆశా వర్కర్లు తదితర సామాజిక తరగతుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించే నాయకుడు లక్ష్మణరావుగా గుర్తుచేశారు. ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి ఆయన చేసిన కృషిని నాయకులు వివరించారు. ఈనెల 27వ తేదీన జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావును మరోసారి గెలిపించుకుని అండగా నిలుపుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి, పిల్లి రాజశేఖర్, శ్యానం ప్రకాష్, పిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా సదనంలో కోలుకుంటున్న మానసిక బాధితుడు



తెనాలి: రోడ్డువెంట మాటాపలుకు, దుస్తులు లేకుండా సంచరించిన వ్యక్తి గోరంట్లలోని కార్మెల్ సేవా సదనంలో కోలుకుంటున్నాడు. స్థానిక కొత్తపేటలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఏళ్లతరబడి రోడ్డుపై గడుపుతున్న వ్యక్తి దుస్థితిపై ఈనెల ఆరో తేదీన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. అదేరోజు గుంటూరు సమీపంలోని గోరంట్లలో గల కార్మెల సేవాసదనాన్ని సంప్రదించారు. వారు ఆ రాత్రి ప్రాంతంలో వాహనంలోకి ఎక్కించుకుని తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లిన వెంటనే క్షురకర్మ చేయించి, స్నానం చేయించి దుస్తులు తొడిగారు. సేవాసదనంలో ఆశ్రయం పొందుతున్న ఆ వ్యక్తి యోగక్షేమాలను తెలుసుకునేందుకు ఆదివారం తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అక్కడకు వెళ్లారు. పరిశుభ్రంగా కనిపిస్తున్న అతడిని పలకరించాడు. కొన్ని ప్రశ్నలకు జవాబులు ఇచ్చిన అతడు, గతానికి సంబంధించిన కొన్ని అంశాలను పొంతన లేకుండా చెప్పాడట! ఇన్నేళ్లుగా ఎవరితోనూ పలకని వ్యక్తి ఇప్పుడు మాట్లాడుతుండటాన్ని చూసి కమిషనర్ సంతోషించారు. కొన్నిరోజులైతే స్వస్థత చేకూరుతుందన్న ఆశాభావాన్ని సేవాసదన్‌లోని సేవకులు వెలిబుచ్చారని తెలిపారు.